ప్రజాశక్తి
మంగళవారం 8 ఆగస్టు 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మున్సిపల్ కార్మికులపై పోలీసు జులుం

◆ విశాఖలో తీవ్ర నిర్బంధం ◆ కలెక్టర్‌కు సమస్యను చెప్పుకుందామన్నా ఒప్పుకోని ఖాకీలు ◆ ర్యాలీ అడ్డగింత, 200 మంది అరెస్టు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి పారిశుధ్య కార్మికులపై విశాఖలో సోమవారం పోలీసులు జులుం ప్రదర్శించారు. తమ సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకుంటామని ర్యాలీగా బయలుదేరిన కార్మికులకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. ప్రతిఘటించి ప్రదర్శనగా వెళ్తున్న వారిపై నిర్బంధం ప్రయోగించారు. 200 మందిని అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మహిళలపై మగ పోలీసులు చేయిచేసుకోవడం, దొరికినవారిని దొరికినట్లుగా వ్యాన్‌లోకి ఎత్తిపడేయడం పోలీసుల దాష్టీకానికి పరాకాష్టగా నిలిచింది. ప్రభుత్వ, పోలీసు చర్యను పలువురు ఖండించారు.

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఇచ్చిన పిలుపునకు విశాఖలో విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున సోమవారం ఉదయానికే కార్మికులు తరలివచ్చారు. సరస్వతీ పార్కు నుంచి ప్రదర్శనగా కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్ళాలని నిర్ణయించారు. పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతులు ఇవ్వకుండా జివిఎంసి గాంధీ



మహిళా కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు



సభలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

విగ్రహం వద్ద చేసుకోండని నాయకులకు తెలిపారు. ఒక పక్క చర్చలు జరుపుతూనే మరోవైపు ద్వంద్వ వైఖరి అవలంబించారు. ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు సహా వందలాది మంది పోలీసులు మోహరించారు. కార్మికులు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభ పెట్టుకుంటే సభ చుట్టూ పోలీసులు గుమిగూడారు. కార్మికుల చుట్టూ రోప్‌తో సర్కిల్ విధించడంపై జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడేవారిపై ఏమిటీ నిర్భంధమని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు మిగతా 2లో..

నిర్బంధం ఆపి తక్షణమే పర్మినెంట్ చేయాలి : సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన కార్మికులపై పోలీసులు విరుచుకుపడటాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఒక ప్రకటనలో ఖండించారు. మహిళలపై మగ పోలీసులు చేయిచేసుకోవడం, దొరికినవారిని దొరికినట్లుగా వ్యాన్‌లోకి ఎత్తిపడేయడం వంటి చర్యలపై మండిపడ్డారు. నిర్బంధం ఆపి వెంటనే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

చేనేతకు మరింత ప్రోత్సాహం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జాతీయ చేనేత దినోత్సవ స్ఫూర్తితో నేతన్నలకు మరింత ప్రోత్సాహం ఇద్దామని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల డిజైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషికి అసలైన గుర్తింపునిచ్చే చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. గత సంవత్సరం చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇకపై ప్రతి వారం వస్త్ర ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ వంటి ప్రసిద్ధి చెందిన చేనేత వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. చేనేత ఉత్పత్తులకు ఆప్కో ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద మగ్గాల ఆధునికీకరణకు ప్రతి చేనేత కార్మికునికీ రూ.24 వేలు ఇస్తోందన్నారు. చేనేత వస్త్రధారణ ఆరోగ్యదాయకమని, ప్రతి ఒక్కరూ చేనేత కార్మికులను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణమ్మ, డిఎల్‌డిఒ పూర్ణిమా దేవి, డిఇఒ చంద్రకళ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి మాధవి పాల్గొన్నారు.

సూర్య పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలి

▶ వార్త 6లో..

విఆర్ఎల సమస్యలపై 36 గంటల ధర్నా ప్రారంభం

▶ వార్త 5లో..

పాకిస్తాన్ హనీ ట్రాప్‌లో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్

▶ వార్త 3లో..

ప్రజలను నిలువునా ముంచిన వైసిపి

హామీల అమలేదీ ? - టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో అన్ని తరగతుల ప్రజలనూ వైసిపి ప్రభుత్వం నిట్టనిలువుగా ముంచేసిందని టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ విశాఖ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అందరికీ ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్రజల కష్టాలు రెట్టింపయ్యాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, చేస్తున్న అరాచకాలు, విధ్వంసాలను నిరసనల ద్వారా ప్రజలకు తెలియజేయాలని టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకన్న, గంటా

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం డబ్బులకు కక్కుర్తి పడి ప్రభుత్వ ఆస్తులను విశాఖలో తాకట్టు పెట్టిందని అన్నారు. జగన్ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఛార్జిషీటు కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టామని, అందరూ హాజరై జయప్రదం మిగతా 2లో..

మృదంగ విద్వాంసులు కేసానపల్లి కన్నుమూత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో పనిచేసిన మృదంగ విద్వాంసులు కేసానపల్లి జ్ఞానానందం (72) సోమవారం ఉదయం కన్ను మూశారు. కుమార్తెకు మందులు విషయమై కేరళ వెళ్లిన ఆయన ఉదయం ఏడు గంటల ప్రాంతంలో గుండె పోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మంగళవారం విశాఖలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ముళ్లపూడి బాణీ అనుసరించే కేసానపల్లి కడప, విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రాలలో 27 ఏళ్ల నిలయ విద్వాంసునిగా సేవలందించారు. విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రం నుంచి 2011లో ఉద్యోగ విరమణ చేశారు. విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆయన మృదంగ విద్యనభ్యసించారు. కాట్రావులపల్లి వీరభద్రరావు ప్రియ శిష్యులు. ప్రపంచ ప్రఖ్యాత సంగీత విద్వాంసులు ఎందరికో మృదంగం, కంజీరాలపై సహకరించి లబ్ద ప్రతిష్టులయ్యారు. మృదంగంలో ఎ గ్రేడ్, కంజీరాలో టాప్ గ్రేడ్ ఆర్టిస్టు అయిన జ్ఞానానందం ఎంతో మందిని మృదంగం కళాకారులుగా తీర్చిదిద్దారు.

ఎపి స్టెమీ ప్రాజెక్ట్‌పై శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోవిడ్ తర్వాత వైద్య రంగంలో వివిధ మార్పులు సంతరించుకున్నాయని, ముఖ్యంగా యువకులు గుండెపోటుకు అధికంగా గురవుతున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. గుండెపోటుకు కచ్చితమైన కారణాలు కనుగొనడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్టెమీ ప్రాజెక్ట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించిందని చెప్పారు. సోమవారం ఉదయం కెజిహెచ్‌లో జరిగిన ఎపి స్టెమీ ప్రాజెక్ట్ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 19 వరకూ 10 రోజుల పాటు సిహెచ్‌సి, పిహెచ్‌సిలలో వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి ఎపి స్టెమీ ప్రాజెక్ట్ శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలను గుండె పోటు నుంచి రక్షించి మరణాలను తగ్గించవచ్చని వివరించారు. గుండెపోటు మరణాలను



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

నివారించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టెమీ ప్రాజెక్ట్‌ను ప్రారంభిం చిందన్నారు. కెజిహెచ్‌లో ఉన్న కార్డియాలజీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యులు ఈ ప్రాజెక్టులో కీలకమని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ శివానంద, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

మున్సిపల్ కార్మికులపై పోలీసు జులుం

రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రాష్ట్ర వైసిపి ప్రభుత్వం పర్మినెంట్ చేసే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని తాము అడుగుతున్నామన్నారు. పర్మినెంట్ చేయకుండా కార్మికులను మోసగించడం సరైంది కాదని దుయ్యబట్టారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులే లేకపోతే ఈ నగరం కంపు పట్టిపోతుందని తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లేందుకు కార్మికులు సిద్ధమవగా పోలీసులు 200 మందిని అరెస్టు చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కుమార్, యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి, యు.రాజు, టి.నూకరాజు, ఎంవి.ప్రసాదరావు, రమణ, కె.కుమారి, వరలక్ష్మి, జెఆర్.నాయుడు అరెస్టయిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్,హెల్త్ అలవెన్సు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులను ఖండించిన సిపిఎం, సిఐటియు

అక్రమ అరెస్టులను, ప్రభుత్వ నిర్బంధకాండను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో మున్సిపల్ కార్మికుల సేవలు అమోఘమని గుర్తు చేశారు. వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.



అనకాపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

అనకాపల్లిలో ధర్నా

అనకాపల్లి : మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు సంఘీభావం తెలియజేసిన ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పర్మినెంట్, కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్, క్లాప్ డైవర్స్, వాటర్ వర్క్స్ తదితర కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని, డెత్, రిటైర్మెంట్, అనారోగ్యానికి గురైన వారి పోస్టులను వారి వారసులతో భర్తీ చేయాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. సిఐటియు మండలం ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీవీఎంసీలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాల కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మాల రాము, వాసు, శేఖర్, శివకుమార్, అమ్మాజీ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయం



దీప్తికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయమని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించిన ఒకరిని సేవా ఆరోగ్యమిత్రగా పేర్కొంటూ తన ఛాంబర్‌లో సోమవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా ఒకరిని ఎంపిక చేసి వారికి ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారం అందిస్తామన్నారు. జూన్ నెలకుగాను గీతం హాస్పిటల్‌లో పనిచేస్తున్న అరోగ్యమిత్ర చిప్పాడ దీప్తికి ప్రశంసాపత్రంతో పాటు రూ.5 వేల నగదు పురస్కారం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కెవివిఎస్‌ఎన్.రాజేష్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జానకమ్మలు నాలుగో మెమోరియల్ ఓపెన్ జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆంధ్ర యూనివర్సిటీ జిమ్నాజియం ప్రాంగణంలో ఆదివారం ముగిశాయి. ఈ పోటీలలో అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో 60 మంది అంతర్జాతీయ క్రీడాకారులు ఉండటం విశేషం. ఈ క్రీడల ముగింపు కార్యక్రమనికి ముఖ్య అతిథిగా స్టీల్‌ప్లాంట్ ఎఐటియుసి యూనియన్ అధ్యక్షులు కె.సత్యనారాయణ హాజరయ్యారు. విజేతలకు 30 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేశారు.

విజేతల వివరాలను శ్రీ చెస్ అకాడమీ నిర్వాహకులు శ్రీకాంత్ వెల్లడించారు. ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.బాబూరావు, సీనియర్ చెస్ ప్లేయర్ భాస్కర్‌రావు, నిర్వాహకులు వి.ఫకీర్‌దాస్ పాల్గొన్నారు.

గణనీయ వృద్ధిలో 'మీ షో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలోని ప్రముఖ ఈ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన మీషో గణనీయమైన వృద్ధి బాటలో నడుస్తోందని ఆ సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త వెల్లడించారు. సోమవారం విశాఖలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ పురోగతిని తెలిపారు.

ప్రజలను నిలువునా ముంచిన వైసిపి

(మొదటి పేజీ తరువాయి..)

చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి బండారు సత్య నారాయణ మూర్తి, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవి, దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, ఎస్.కోట నియోజవర్గం ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, పార్టీ నాయకులు కోళ్ల రాంప్రసాద్, వివిఎస్‌ఎన్ మూర్తి యాదవ్, బొండా జగన్, గంటా నూకరాజు పాల్గొన్నారు.

స్పందనకు అర్జీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ త్రినాధరావు, రెవిన్యూ ఆఫీసర్ ఇబ్రహీం, విఆర్ఒలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు పలు సమస్యలపై 3 అర్జీలు అందజేశారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2, రెవెన్యూకు సంబంధించి ఒకటి అందాయి.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-మధురవాడ : భీమిలి నియోజకవర్గ పరిధిలో రాజులుతాళ్లవలస పంచాయతీకి చెందిన ఏరుసు సూర్‌రెడ్డి, రామసూరి ఆధ్వర్యాన సుమారు 50 మంది యువకులు ఎండాడలోని పార్టీ కార్యాలయంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బివి.కృష్ణయ్య, చంద్రరావు, శాఖరి శ్రీనుబాబు, పిల్ల బాలు, శ్రీకాంత్ రెడ్డి, నక్కగుడివాడ కిరణ్, ఎన్.రాజు, సుధీర్, శ్రీధర్ పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట ఎంపియుపి పాఠశాలలో సోమ వారం విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొట్టిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి పెదగదిలిలోని శ్రీకృష్ణ యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. సంఘం నూతన అధ్యక్షునిగా కోలా బంగారయ్య, ఉపాధ్యక్షులుగా ఒమ్మి వెంకటి, సమ్మి నాయుడు, కార్యదర్శిగా చల్లా రాజు, బి.జగదీష్, పిట్ట సంతోష్, కోశాధికారులుగా పాల్తేరు హేమసుందర్, మగడ తాతాజీ, సలహాదారులుగా ధూళి రఘు, పెసల శ్రీను, హెడ్ కమిటీ సభ్యునిగా బుద్దల శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీతల కిరణ్ కిషోర్‌తో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీకి మేయర్ అభినందనలు తెలిపారు.

'ఆలయానికి వెళ్తే అడ్డుకోవడం అన్యాయం'

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖలో జనసేన అధినేత పవన్‌కల్యాన్ నిర్వహించే వారాహి యాత్ర విజయవంతం కావాలని రుషికొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్తే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల పేర్కొన్నారు. పూజలు చేసుకునేందుకు కూడా వెళ్లనివ్వరా అంటూ ప్రశ్నించారు. విశాఖను, రుషికొండను కాపాడు గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేశారు. రుషికొండపై జగన్మోహన్‌రెడ్డి, తర్లువాడలో విజయసాయిరెడ్డి, ఎర్రమట్టిదిబ్బల్లో వైసిపి నాయకులు ఆక్రమణలకు పాల్పడుతున్నారని సందీప్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఇఎన్ఎస్ చంద్రరావు, బివి.కృష్ణయ్య, ఎన్ఎన్.నాయుడు, శాఖరి శ్రీనుబాబు, పోతిన అనురాధ పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఇతర జిల్లా అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2023-24 విద్యా సంవత్సరానికి పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాధన్, డిఇఒ ఎల్.చంద్రకళ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ, సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పది, ఇంటర్ ప్రవేశాల్లో ఎక్కువ మందిని చేర్చేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సార్వత్రిక విద్యావిధానంలో పది, ఇంటర్ పూర్తి చేసిన వారు ఉన్నత చదువుల కోసమని కళాశాలలు, యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. అంగన్వాడీ, ఆశ వర్కర్లు, చిరు ఉద్యోగుల తదుపరి ఉద్యోగోన్నతి కోసం ఎక్కువగా సార్వత్రిక విద్యలో చేరుతున్నారని గుర్తు చేశారు. ఇంటర్ తరువాత ఓపెన్ విధానంలో డిగ్రీ, పీజీ కోర్సులు సైతం చదువుకునే అవకాశం ఉందన్నారు.

19న లక్ష్మీపురం పంచాయతీ ఉప ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ స్థానానికి, టి.నగరపాలెం 10వ వార్డు స్థానానికి ఈ నెల 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎండిఒ పి.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 8వ తేదీన సర్పంచ్ లచ్చుబుగత రామారావు మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 11వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన, తిరస్కరణకు గురైన నామినేషన్లపై 12వ తేదీ వరకు ఆర్డీవోకు అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. 19న ఎన్నిక జరిగాక అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని వివరించారు.

టి.నగరపాలెం 10వ వార్డు స్థానానికి కోరాడ సూరిబాబు వ్యక్తి గత కారణాల వల్ల తన పదవికి రాజీనామా చేయడంతో స్థానానికి కూడా అదే తేదీన ఎన్నిక జరగనుందని పేర్కొన్నారు.

ఉపకార్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అచ్యుతరావు, ఉపేంద్ర

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపకార్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆరిలోవ హెల్త్ సిటీ మైదానంలో సోమవారం ఉపకార్ ట్రస్టు చైర్మన్, వర్ధమాన సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి క్రీడల వైపు మళ్లించేందుకు ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. కరాటే, బాక్సింగ్, వాలీబాల్ టోర్నమెంట్లకు సహాయ సహకారాలు అందించనున్నట్టు చెప్పారు. త్వరలో క్రీడాకారులకు ప్రత్యేకంగా ఒక నిధిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వర్ధమాన సినీ హీరో కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ, తన పర్యవేక్షణలోనే ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి విజేతకు రూ. లక్ష నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ విజేతకు రూ.50 వేలు నగదు, ట్రోఫీ, తృతీయ విజేతకు రూ,25 వేలు నగదుతో పాటు ట్రోఫీ అందజేయనున్నట్టు వివరించారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన క్రీడాకారునికి రూ.10 వేలు, ఉత్తమ బ్యాట్స్‌మ్యాన్, బౌలర్లకు రూ.5వేలు చొప్పున నగదు, జ్ఞాపికలు అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఇన్‌ఛార్జి సుధీర్, నాగ, హరి, రెహమాన్, నవీన్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వైఖరిపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

పుంగనూరులో చంద్రబాబు వైఖరికి నిరసనగా వైసిపి ఆధ్వర్యాన సోమవారం పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

గాజువాక : పుంగునూరులో పోలీసులపై టిడిపి నాయకులు దాడి నీచమైన చర్యగా భావిస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పోలీసులపై దాడిని ఖండిస్తూ పెదగంట్యాడ ప్రధాన కూడలిలో నాగిరెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం టిఎన్ఆర్ కల్యాణ మండపంలో పాత్రికేయులు సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడారు. ఇటువంటి దౌర్జన్యాలు, నీచ రాజకీయాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నరసింహపాత్రుడు, మహమ్మద్ ఇమ్రాన్, ఉరుకుటి చందు, నాయకులు పల్లా చిన్న తల్లి, ఈగలపాటి యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : జివిఎంసి జోన్-2 కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద 5, 6, 7, 8 వార్డుల వైసిపి నాయుకులు నిరసన తెలిపారు. జగన్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తా లేక పుంగనూరులో చంద్రబాబు తన కార్యకర్తలను, పెయిడ్ ఆర్టిస్టులను పోలీసుల మీదకు ఉసిగొల్పి హింసను ప్రోత్సహించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాస్, పోతిన యల్లాజి, పోతిన ప్రసాద్, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, పిళ్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక వై జంక్షన్‌లో వైసిపి శ్రేణులు నిరసన తెలిపాయి. నిరసననుద్దేశించి పార్టీ నాయకులు బంక సత్యం, జగుపిళ్ల ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పార్టీ అధ్యక్షులు, జివిఎంసి 1, 2, 3, 4 వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

సీతమ్మధార : చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల వైఖరిని వ్యతిరేకిస్తూ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన తాటిచెట్లపాలెం జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, వైసిపి నాయకులు చల్లా రజిని, ఈశ్వరరావు, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, వి.ప్రసాద్, కెవిఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి ఆర్ఆర్.వెంకటాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... సుజాతనగర్‌లో నివాసముంటున్న రాజశేఖర్ కంచరపాలెంలోని గౌరీ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. చినముసిడివాడ నుంచి గోపాలపట్నం వైపు రాజశేఖర్ వెళ్తుండగా ఆర్ఆర్ వెంకటాపురంలో అల్వార్‌దాస్ కాలేజీ సమీపంలో వెనుక వైపు నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో స్కూటీ పై నుండి రాజశేఖర్ ఎగిరి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాకిస్తాన్ హనీ ట్రాప్‌లో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ పాకిస్థాన్ హనీ ట్రాప్ వలలో చిక్కినట్టు సమాచారం అందటంతో అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర నిఘా వర్గాల అలర్ట్‌తో విశాఖ సిఐఎస్ఎఫ్ వింగ్ రంగంలోకి దిగింది. కానిస్టేబుల్ కపిల్ కుమార్ జగదీష్‌ను అదుపులోకి తీసుకొని సిఐఎస్ఎఫ్ అధికారులు విచారిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విశాఖ సిఐఎస్ఎఫ్ యూనిట్ అధికారులు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

తల్లిపాల ప్రాధాన్యతపై ర్యాలీ

ప్రజాశక్తి-మధురవాడ : తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేస్తూ గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో రుషికొండ గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లి పాలలోని పోషక విలువలతో బిడ్డకు జీవితకాలం ఆరోగ్య రక్షణ ఉంటుందన్నారు. సుమారు 150 మంది నర్సింగ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ ర్యాలీలో పాల్గొని తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహనకలిగించే బ్యానర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు టి.మాలతి, సిహెచ్.లావణ్య, డి.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్యకళాశాల వైద్యవిద్యార్థుల ఆధ్వర్యాన తల్లిపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రిలోని ఓపి విభాగంలో లఘు నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిమ్సర్ ప్రొవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, జిమ్సర్ ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిపద్మజ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.బోధిశ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా ఇంటింటికి జరిగిన సర్వే వివరాలు తెలిపేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న రమణి, అనంతలక్ష్మి తదితరులు

వీరానగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి వీరానగర్‌లో మౌలికసదుపాయాలు కల్పించాలని కోరుతూ జివిఎంసి కార్యాలయ సూపరింటెండెంట్‌కు సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, ఐద్వా నాయకులు అనంతలక్ష్మి, సిఐటియు నాయకులు అప్పలనాయుడు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బి.రమణి మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా వీరానగర్‌లో సుమారు 50 కుటుంబాలు పైబడి నివాసం ఉంటున్నాయని, ఇంటి పన్నులు వేయకపోవడంతో విద్యుత్తు మీటర్లు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ లేక పిల్లలు రాత్రి వేళల్లో చదవలేకపోతున్నారని, చీకటిలో పాములు సంచారంతో ప్రజలు బయాందోళన చెందుతున్నారని వివరించారు. తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

నూతన భవనంలోకి పాఠశాల

ప్రజాశక్తి-సీతమ్మధార : శిథిలావస్థకు చేరుకున్న వాసుదేవనగర్ జివిఎంసి ఎలిమెంటరీ పాఠశాలను లక్ష్మినారాయణపురంలోని



నూతన భవనంలోకి మార్చారు. ఈ నూతన పాఠశాల భవనాన్ని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, జివిఎంసి అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో గొండు సీతారాం మాట్లాడుతూ జూన్ చివరి నెలలో పాఠశాలను పరిశీలించానని, శిథిలావస్థలో ఉండటంతో జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, నగర మేయర్ హరివెంకట కుమారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారు స్పందించి త్వరిత గతిన నూతన స్కూల్ భవనంలోకి మార్చడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్ మాట్లాడుతూ, అందరి సహకారంతో త్వరితగతిన కొత్త భవనంలోకి మార్చగలిగామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఎక్స్ ఆఫీషియో సభ్యులు సేనాపతి అప్పారావు, జివిఎంసి ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి-2 బాలామణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, సిఆర్ఎంటివి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేనేతల జీవితాల్లో వెలుగులు నిండాలి

ప్రజాశక్తి -యంత్రాంగం :

ములగాడ : చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండేలా స్వదేశీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి వి.లక్ష్మీదేవి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత సంస్కృతిలో చేనేత ఒక భాగం అన్నారు.

ప్రతి ఒక్కరూ సాధ్యమైనంతవరకు చేనేతను ధరించాలని, తద్వారా డిమాండ్‌ను ఏర్పరచాలని కోరారు. అధ్యాపకులు అందరూ చేనేత చీరలను ధరించి చేనేతను రక్షిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

డైట్‌లో చేనేత దినోత్సవం

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో జాతీయ చేనేత దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ మాట్లాడుతూ, అందరూ చేనేత వస్త్రాలను ధరిస్తూ ఆ కార్మికులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి, చేనేతకు అవినాభావ సంబంధం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భీమిలిలో చేనేత వస్త్రాలు ధరించిన చాత్రోపాధ్యాయులు ఐ లవ్ హ్యాండ్ లూమ్ ప్రదర్శన నిర్వహించారు.

35వ రోజుకు గంగవరం దీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదానీ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలు సోమవారం నాటికి 35వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరాన్ని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, సీతానగరం గ్రామ పెద్దలు పులి రమణారెడ్డి సోమవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ, కార్మికులు న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం రూ.36 వేలు, మెడికల్ సౌకర్యం కల్పించాలని, ఎంప్లాయ్ కార్డు ఇవ్వాలని, తొలగించిన 29 మందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్మికులకు సంఘీభావంగా రూ.6 వేలు అందజేశారు. కార్యక్రమంలో వంశీకృష్ణయాదవ్, సిఐటియు నాయకులు కణితి అప్పలరాజు, ఐఎన్‌టియుసి నాయకులు నమ్మి అప్పలనాయుడు, ఒబిసి సి నాయకులు ముసిరి, ఉరిటి ఎల్లాజీ, ముల్లి సింహాద్రి, కొవిరి అప్పలరాజు, అమ్మోరు, నూకరాజు, మాదా అప్పారావు, లొల్లి స్వామి, ఎల్లాజీ పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న పులి లక్ష్మీబాయి

గద్దర్ మృతిపై సంతాపం



నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు

ప్రజాశక్తి -యంత్రాంగం

కరాస: ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శాంతినగర్‌లోని హస్మిభవనంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. విప్లవ ప్రజా గాయకుడు, ప్రజా, వామపక్ష ఉద్యమాలకు తన పాటలు, ఆటలతో ఉత్తేజం కలిగించిన గద్దర్ ఆకస్మికంగా మరణించడం బాధాకరమని ప్రజానాట్యమండలి సభ్యులు పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకులు ఎం.చంటి, జి.రమణ, దండు నాగేశ్వరరావు, అరుణ్‌జి, కె.సత్యనారాయణ, మౌలాలి, స్టాలిన్, ఎల్లాజీ, కృష్ణార్జున, ఒ.విజయ పాల్గొన్నారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కే నేటి మతోన్మాద పాలకుల విధానాల పట్ల అభ్యుదయ, వామ పక్షవాదులు, ప్రజాతంత్ర శక్తులు ప్రజల పక్షాన నిలిచి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు.

అనకాపల్లి : ప్రజా గాయకుడు గద్దర్‌కు స్థానిక కోడిగండి గోవిందరావు భవన్లో సిపిఐ, ఎపి ప్రజానాట్యమండలి నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్.భద్రం మాట్లాడుతూ తన ఆటపాటలతో పీడిత, బడుగు బలహీన వర్గాల, కార్మికుల, రైతులను చైతన్యవంతులను చేసి పోరాటానికి సంసిద్ధం చేయడంలో గద్దర్ పాత్ర చిరస్మరణీయమన్నారు. ఈ సమావేశంలో మత్తుర్తి సూరిబాబు, బొడ్డేడ వీరునాయుడు, సత్యారావు, కోన లక్ష్మణ, బాల తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సిఐటియు కార్యాలయంలో ప్రజా గాయకుడు గద్దర్ చిత్ర పటానికి సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గాడి ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు ఎర్ర దేముడు మాట్లాడుతూ ఉద్యమాలకు స్ఫూర్తిదాత గద్దర్ అని, ఆయన లేని లోటు తెలుగు రాష్ట్రాల్లో తీరనిదని పేర్కొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

కిమ్స్ కడల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ వసంత

ప్రజాశక్తి -గాజువాక : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని షీలా నగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కడెల్స్ కన్సల్టెంట్ ఒబెస్టిక్స్, గైనకాలజిస్ట్ డాక్టర్ వసంత తెలిపారు. పోతపాల కంటే తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉంటారని పేర్కొన్నారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, వజ్ర సమానమైన రోగనిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టించాల్సిందేనని స్పష్టంచేశారు. తల్లి పాలు పట్టడం వల్ల తల్లికి, బిడ్డకు ఇద్దరికీ లాభాలున్నాయని వివరించారు. ఎన్నోరకాల



శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయని, బిడ్డ మానసిక శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయని వివరించారు. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు నుంచి మూడు గంటలకొకసారి తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నెలల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని పేర్కొన్నారు. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలని తెలిపారు. తల్లిపాలలోని

వ్యాధుల నివారణకు దోహదపడుతాయని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి 6నెలల వరకు తల్లిపాలు తప్ప మరే పదార్థాలూ ఇవ్వకూడదని పేర్కొన్నారు. తల్లి పాలు తేలికగా జీర్ణమవుతాయని, ఎటువంటి క్రీములు లేకుండా ఉంటాయని, లాక్టోజ్‌తో కాల్షియం నిల్వలు పెరుగుతాయని, బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయని, తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటువ్యాధుల బారినుంచి కాపాడుతాయని తెలిపారు.

అప్సా జిల్లా కార్యదర్శిగా భాస్కరరావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఇండస్ట్రియల్ ఏరియా ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) అధ్యక్షులుగా ఉన్న భాస్కరరావు ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా జిప్సాకు చేస్తున్న సేవలను గుర్తించి ఆయన్ను అప్సా కార్యదర్శిగా నియమించినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జిప్సా సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, శోభన్‌బాబు, జగ్గారావు, వాసు, జగన్, బాబూరావు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.



భాస్కరరావును సన్మానిస్తున్న జిప్సా సభ్యులు

కరాటేతో రక్షణ

ప్రజాశక్తి -గాజువాక : కరాటే ద్వారా రక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని విశాఖ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజూ ప్రాక్టీస్ చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం ఉంటుందన్నారు. వికాస్‌నగర్‌లో రాష్ట్ర వ్యాప్త కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో విశాఖ జిల్లా, రెండు మూడు స్థానాల్లో శ్రీకాకుళం కాకినాడ జిల్లా క్రీడాకారులు నిలిచారు. వారికి సర్టిఫికెట్స్, మెడల్స్, ట్రోఫీలను అతిథుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ కంప్యూటర్స్ అధినేత డాక్టర్ కరణంరెడ్డి నర్సింగరావు, కరాటే సంఘం అధ్యక్షులు బాలకృష్ణ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, సెక్రటరీ తాతారావు, రిఫరీలు శ్రీనివాసరావు, రంజిత్‌కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సంజీవయ్య, రవికుమార్, నవీన్‌కుమార్, ప్రేమ్ కుమార్, సన్నీ, వెంకట్, సీనియర్ కోచ్‌లు, నాగేశ్వరరావు, భువనేశ్వరి, రంజిత్, తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉక్కునగరం : లయన్స్ క్లబ్ కూర్మనపాలెం శాఖ ఆధ్వర్యాన ఎన్ఐటి, ఐఐటిలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున ఆర్థిక సహాయం చేసి బహుమతులు ప్రధానం చేశారు. పెద్ద గొల్లలపాలెంలోని వేద పాఠశాలలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి కెవి.ప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కణితి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూనే ఎన్ఐటి, ఐఐటిలలో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకరరావు, సీతారామరాజు, ప్రసాద్‌నాయుడు, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌పై అవగాహన

మాధవధార : స్వచ్ఛ సర్వేక్షన్ -2023లో జివిఎంసి మెరుగైన ర్యాంకు సాధించడం కోసం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షులు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో జోన్ -5 సహాయ వైద్య శాఖ అధికారి సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సుధాకర్ ఆధ్వర్యాన పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో మొబైల్‌లో సిటిజెన్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.70 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు 34 రోజులకు గాను సోమవారం దేవస్థానం ఈవో వి.త్రినాధరావు పర్యవేక్షణలో లెక్కించారు. నగదు రూ.1,70,55,730, బంగారం 112 గ్రాముల ఐదు మిల్లీగ్రాములు, వెండి 10 కేజీల 50 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ ఉన్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

వీఆర్ఏల సమస్యలపై 36 గంటల ధర్నా ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం 36 గంటలు ధర్నాను ప్రారంభించారు. ఈ ధర్నాకు సంఘీభావం తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తుది వరకు పోరాడాలన్నారు. వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు కె.రవికుమార్ మాట్లాడుతూ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, గ్రేడ్ వన్ వీఆర్వోలుగా ప్రమోషన్ల కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చి మాట తప్పారని, వెంటనే రాష్ట్ర సంఘంతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర సచివాలయాన్ని ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని





అనకాపల్లి ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, విశాఖలో మాట్లాడుతున్న సిఐటియు నేత కృష్ణారావు

హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎన్ గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర, కోశాధికారి ఎం సంతోష్ కుమార్, సహాయ కార్యదర్శి డేవిడ్ పెద్ద ఎత్తున వీఆర్ఏలు పాల్గొన్నారు. రాత్రి కూడా కలెక్టర్ కార్యాలయం వద్ద బస చేసి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

విశాఖ కలెక్టరేట్ : గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రెండు రోజులపాటు తలపెట్టిన ఆందోళనను సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినీగా ఉన్న విఆర్ఎలను రెగ్యులర్ చేయాలన్నారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 25న చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ అలమండ సత్యం, నాయకులు పి.సాధు, అనపర్తి శంకరమ్మ, శంకరరావులతో పాటు 11 మండలాల విఆర్ఎలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చొక్కాకుల వెంకటరావు, కరణం ధర్మశ్రీ

కార్యకర్తలంతా ఏకతాటిపైకి రావాలి

ప్రజాశక్తి-చోడవరం : నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం నాయకులు కార్యకర్తలను ఒకే తాటిపైకి రావాలని వైసిపి చోడవరం నియోజకవర్గం పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించి సమన్వయం చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ బిఎన్ రోడ్లో విపరీతంగా దెబ్బతిన్న చోట్ల తారుకు బదులుగా సిసి రోడ్లు ఏర్పాటు చేయనున్నామని, ఇందుకోసం రూ.12 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. జన్నవరంలోని జ్యోతిరావు పూలే పాఠశాలకు రూ.35 కోట్ల నిధుల మంజూరైనట్లు చెప్పారు.

పంటల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కుంచం రైతు భరోసా కార్యాలయంలో సోమవారం డివిజనల్ వ్యవసాయ అధికారి ఎం.రామారావు అధ్యక్షతన ఆర్‌బికే వ్యవసాయ సలహా మండలి సభ్యులకు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విశాఖపట్నం వ్యవసాయ సంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మరింత ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసే విధంగా ఈ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఎడి శ్రీధర్, వ్యవసాయ శాస్త్రవేత్త రామలక్ష్మి, ఎంపీడీవో కేవీ నరసింహారావు, యుఏపిఆర్డి కే ధర్మారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మొల్లి అప్పారావు, మండల వ్యవసాయ అధికారి పి రంగాచారి, ఏవో విజేత, వైసిపి నాయకులు సేనాపతి పెంటారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం బాండ్‌ను అందజేస్తున్న స్నేహితులు

ప్రమాదంలో గాయపడిన స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అసకపల్లి గ్రామానికి చెందిన కర్రి నూకరాజు ఫార్మా కంపెనీలో పని చేస్తుండగా లిక్విడ్ పడిపోవడం శరీరమంతా కాలిపోవడంతో ఇంటి వద్దనే ఉంటుండగా, ఆయన స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. నూకరాజు ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని 2000-2001 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఫ్రెండ్షిప్ డే సందర్భంగా రూ.62 వేలు వసూలు చేసి ఆదివారం అందజేశారు. వారికి నూకరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి వెంకట్రావు, కుసుమ శ్రీను, మండల చక్రవర్తి, జెట్టి శ్రీను, తీడ పెద్ద శ్రీను, తీడ చిన్న శ్రీను, బండి శివకుమార్, గొంతిన నాగరాజు, చిత్రాడ త్రినాథ్, కందుల శ్రీనివాస్, కోండ్రపు శివలక్ష్మి, బొకం శివలక్ష్మి, కరణం సుధ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన అనకాపల్లి నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అవినీతిపై టిడిపి ఆధ్వర్యంలో ఛార్జిషీటు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఓట్లు అడిగే కనీస అర్హత జగన్ మోహన్ రెడ్డికి, మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, మాధంశెట్టి నీలబాబు, కాయల మురళి, బిఎస్ఎంకె జోగినాయుడు, కొణతాల శ్రీనివాసరావు, బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాద్, సబ్బవరపు గణేష్, పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పెద్ద హైస్కూల్లో విద్యార్థులకు నేటి సమాజం - విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజికంగా వారి బాధ్యతను తెలియజేసే చైతన్య పరచాలనే ఉద్దేశంతో అనేక చోట్ల వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి ఆగస్ట్ 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం రోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాబ్జి, సతీష్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఎంపిడిఒ కాండ్రేగుల శశిదేవికి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, పంచాయతీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు గాడి ప్రసాదు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 9 నెలల నుండి వేతనాలు చెల్లించకపోవడంతో వారు కుటుంబ పోషణకు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు వర్షాకాలంలో రైన్ కోట్లు, బూట్లు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్మికులు మృతి చెందితే దహన సంస్కారాలకు 10,000 వెంటనే



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఇవ్వాలని, పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సీతారాం, దుర్గారావు కార్మికులు పాల్గొన్నారు.

విస్సన్నపేట భూములపై సమగ్ర విచారణకు ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధి, విస్సన్నపేట గ్రామం సర్వే నెంబర్ 195/2లో 609.24 ఎకరాల విస్తీర్ణం గల భూమిలో జరుగుతున్న భూ ఆక్రమాలపై సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జనసేన పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా లేఔట్ నిర్మాణం సాగిస్తున్నారని, ప్రభుత్వ గెడ్డలను, కొండలను, దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను, ఈనాం, డి- పట్ట, సీలింగ్, ప్రభుత్వ భూములను అక్రమంగా చదును చేసి వాల్తా చట్టాన్ని సైతం అతిక్రమించారని పేర్కొన్నారు. విఎంఆర్‌డిఏ అనుమతులు లేకుండా బ్రోచర్లు వేసి మార్కెటింగ్ కూడా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి, శ్రీరాందాస్ గోవింద్, మాజీ కౌన్సిలర్ తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, బర్నికాన రాము, గంగుపాం జగదీశ్, అప్పికొండ గణేష్, సీత, కరణం నాయుడు, కోన దుర్గ పాల్గొన్నారు.

స్పందనకు 327 అర్జీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తూ అర్జీదారులు సంతృప్తి పడే విధంగా సమాధానాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 327 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకటరమణ, డ్వామా పిడి ఈ.సందీప్ అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 37

ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన స్పందన" కార్యక్రమానికి 37 దరఖాస్తులు వచ్చాయి. వాటిని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై చక్రధర్ పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కు నిధుల కోసం వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో అక్రిడిటేషన్లు పొందిన జర్నలిస్టులందరికీ జర్నలిస్ట్ హెల్త్ స్కీముకు సంబంధించిన ప్రీమియంను సిఎంఆర్ ఫండ్స్ నుంచి చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి ఎపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్రతినిధి బృందం సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తప్పనిసరిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల డాక్టరేట్ పొందిన జిల్లా కలెక్టర్‌ను సంఘం తరపున సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం రాంబాబు, స్వామి, జోగి నాయుడు, కె.చంద్రరావు, కె.చంద్రశేఖర్, మల్ల భాస్కర్, దూరదర్శన్ శ్రీనివాస్, రమణాజీ పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవానికి పసుపు, కుంకుమ కొనుగోలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించన్న షిర్డీ సాయిబాబా ఆలయ పదకొండవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పసుపు కుంకుమలు కొనుగోలు పనులను ప్రారంభించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి, ఆలయ ధర్మకర్త, మాజీ సర్పంచ్ గొంతిని శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొంతిని నాగరత్నం, గొంతిని నాయుడుబాబు, పాల సంఘం అధ్యక్షులు గూడుపు ప్రకాష్, తాడేలు సూరిబాబు, గొంతిని పెదనాయుడు, నారిపల్లి తాతరావు, నారిపల్లి ప్రసాద్, కర్రి నాగసత్య శ్రీను, నారిపల్లి రామకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎంవిఆర్ ఉచిత తీర్థయాత్ర

ప్రజాశక్తి- వడ్డాది : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్థ యాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం, బంగారు మెట్ట గ్రామపంచాయతీ నుండి ఉచిత తీర్థ యాత్ర బసు సోమవారం బయలుదేరింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శిరిగిరిశెట్టి నానాజీ మాట్లాడుతూ అన్నవరం, సింహాచలం కనకమాలక్ష్మి ఆలయ దర్శనాలు చేయించనున్నట్లు చెప్పారు. యాత్రలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సదుపాయం రాత్రికి ఆల్పారం అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంవీఆర్ కార్యాలయం సిబ్బంది సతీష్ కుమార్, వెంకటేశ్వర సేవ సమితి మండల కార్యదర్శి అలమండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తీర్థయాత్రకు సిద్ధమైన గ్రామస్తులు

సూర్య పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలి

9వ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

సిపిఎం జిల్లా నాయకులు కామ్రేడ్ ఎం.సూర్యనారాయణ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కార్యకర్తా పని చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. ఎం.సూర్యనారాయణ 9వ వర్ధంతి సభ సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సూర్యనారాయణ చిత్రపటానికి లోకనాథం పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఎస్ఎఫ్ఐ నేతగా పేద విద్యార్థుల పక్షాన పోరాటాలు చేశారని తెలిపారు. జిల్లాలో దళిత పేటల్లో ఉన్న వివక్ష రూపాలపై తిరుగుబాటు చేశారన్నారు. ఏజెన్సీలో ఎన్నో కష్టాలకోర్చి దాదాపు 15 ఏళ్ల అక్కడ ఉద్యమ నిర్మాణంలోనూ, గ్రామ గ్రామానికి పార్టీని తీసుకెళ్లడంలోనూ కీలకభూమిక వహించారని పేర్కొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులు, కార్మిక చట్టాల మార్పులు, గిరిజనులను కొండల నుండి గెంటివేయడానికి జరుగుతున్న కుట్రల నేపథ్యంలో సూర్యనారాయణ మన మధ్య లేకపోవడం కమ్యూనిస్టు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, సిహెచ్.శివాజీ, ఎస్.నాగరమణ, పి.చలపతి, రాము, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ 9వ వర్ధంతి కార్యక్రమం స్థానిక సిఐటియు కార్యాలయం సోమవారం నిర్వహించారు. సిఐటియు మండల నాయకులు గాడి ప్రసాదు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మృతి కార్మిక వర్గానికి తీరని లోటు అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, నాయకులు వై.రాజు అన్నారు. సూర్యనారాయణ వర్ధంతి కార్యక్రమం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సోమవారం ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యనారాయణ విద్యార్థి ఉద్యమం నుంచి కార్మిక నాయకుడుగా ఎదిగి ఎంతో మందికి మేలు చేశారన్నారు. ముఖ్యంగా గిరిజనోద్యమానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. కెవిపిఎస్ వ్యవస్థాపక జిల్లా ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారన్నారు. నాయకులు పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, పి.మణి, యు.రాజు, నూకరాజు, కె.గణేష్, ఎం.సూరీడు, వి.భారతి పాల్గొన్నారు.





సూర్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అనకాపల్లిలో లోకనాథం తదితరులు, విశాఖలో నర్సింగరావు తదితరులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

చంద్రబాబును విమర్శించే అర్హత బూడికి లేదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : టిడిపి అధినేత, మాజీ మంత్రి చంద్రబాబునాయుడుని విమర్శించే అర్హత ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు లేదని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. సోమవారం దేవరాపల్లిలో టిడిపి నాయకుడు ఎల్లేటి కరుణాకర్‌రావు ఇంటి వద్ద రామానాయుడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబు పర్యటనతో వైసిపి నేతల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. పులివెందులలో చంద్రబాబు బహిరంగ సభ విజయవంతం కావడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిచ్చి పరాకాష్టకు చేరిందని ఎద్దేవా చేశారు. ఈసమావేశంలో టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శెరకాన సూర్యనారాయణ, పూడి సత్యారావు, గంధం జగ్గారావు, దొగ్గ రమేష్, రెడ్డి నాయుడు, ఎంపిటిసి పైల ముత్యాల నాయుడు, గొర్లి దేముళ్ళు, గోవిందమ్మ బండారు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ హైస్కూల్ 1992-97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం అపూరూప కలయిక ఏర్పాటు చేశారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హైస్కూల్ ఆవరణలో నూతనంగా భారతమాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విందు, వినోదాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు), పిల్లల శేఖర్, గొర్లి దేముడు బాబు, కిల్లంపల్లి ఈశ్వరరావు, ఎం.వీరబాబు, రాజ్ కిరణ్, శ్రీనివాస రాజేష్ పాల్గొన్నారు.

అంతకాపల్లి హైస్కూల్‌లో..

మండలంలోని అంతకాపల్లి జెడ్‌పి హైస్కూల్ 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు హైస్కూల్‌లో ఆదివారం కలుసుకున్నారు. స్నేహితులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరపు నారాయణమూర్తి, పరదేశమ్మ, రాజేశ్వరి, గంగతల్లి, లక్ష్మి, అప్పలనరసమ్మ, దేవి, లక్ష్మి బాయి, దేముడమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని మామిడిపాలెం హైస్కూల్లో సోమవారం తల్లిదండ్రుల గౌరవార్ధం కార్యక్రమాన్ని సర్పంచ్ పూడి పరదేశి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ పిల్లల సంతోషం మాత్రమే చాలు అనుకునే తల్లిదండ్రులు, తల్లిదండ్రుల ఆనందం కోరుకునే పిల్లలు ఇద్దరు మధ్య బేధాభిప్రాయాలు లేని కుటుంబం స్వర్గమయం అవుతుందని పేర్కొన్నారు. మనం ఉండగా మన తల్లిదండ్రులు వీధి పాలయితే మనం బతికి ఉన్నా చచ్చినట్లేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి పెద్దల చేతులు మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పెద్దలు దాడి వీరభద్రరావు, బీసెట్టి జగన్, సిఎల్ మోహన్ రావు, పాకలపాటి రాజబాబు, మాకవరపు సత్యనారాయణ, స్కూల్ చైర్మన్ మాకవరపు పరమేశ్వరి పాల్గొన్నారు.

79వ వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - పరవాడ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్‌ను జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వార్డులో ముఖ్య సమస్యలు వివరించారు. వీధిలైట్లు రిపేరు, కొత్తగా ఏర్పాటు చేయవలసిన వీధిలైట్లు, వార్డులో టెండర్లు పూర్తయిన వర్కులను వెంటనే పూర్తి చేయించాలని కోరారు. అగనంపూడి టోల్గేట్ వెంటనే ఎత్తివేయడానికి చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

ముగిసిన ఆదివాసీల పాదయాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న నర్సీపట్నంలో ప్రారంభమైన పాదయాత్ర నాలుగో రోజు సోమవారం అనకాపల్లిలో ముగిసింది. ఈ సందర్భంగా అనకాపల్లిలోని కె.బాలగోపాల్ సమావేశ మందిరంలో సంఘీభావ సభ నిర్వహించారు. ఇందులో మానవ హక్కుల వేదిక నాయకులు వివిఎస్ కృష్ణ మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటుతో అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆదివాసీలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ జిల్లాలోని ఆదివాసీలకు ఐటిడిఎ సేవలు దూరమయ్యాయన్నారు. అనకాపల్లి జిల్లాలోని నాన్ షెడ్యూల్ ఏరియాలోని ఆదివాసీలు భూ పరాయికరణను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చామని తెలిపారు. అయితే ఆదివాసీల స్థిరమైన సాగు (సెటిల్డ్ కల్టివేషన్), గ్రామం (విలేజ్ సెటిల్మెంట్) ఉన్నప్పటికీ ఆ విషయాన్ని నిర్ధారించడానికి స్థానిక అధికారులు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై జిల్లా, రాష్ట్ర యంత్రాంగం ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు బినామీల పేరుతో దశాబ్దాలుగా ఆదివాసీల సాగులో ఉన్న భూములను కొనేస్తున్నారని తెలిపారు. ఆదివాసీలు సాగులో ఉన్నప్పటికీ చట్టవిరుద్ధంగా రికార్డులను కొందరు రెవెన్యూ అధికారులు మార్చేస్తున్నారని విమర్శించారు. దీనిపై నిర్దిష్టమైన సమాచారంతో జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ మాట్లాడుతూ బాధిత ఆదివాసీలతోనూ, స్థానిక రెవెన్యూ అధికారులతో ముఖాముఖి సమీక్ష జరపాలన్నారు. సమావేశం అనంతరం ఆదివాసీలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు పీఎస్ అజయ్ కుమార్, వెంపటాపు భారతి, తామడ అరుణ, బుగతా బంగారురావు, దళిత బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న పిఎస్.అజయ్‌కుమార్



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా

మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎన్.పేటలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ రెండోవ వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంఆ అమ్మవారిని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, షేక్ బాబర్, ఆనాల తాతిల నాయుడు, కామకుల వెంకటేష్, పైలా నాగేష్, సిరసపల్లి నాగేష్, గనిసెట్టి అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని మామిడిపాలెం గ్రామంలో శ్రీదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్ల పోటీలు, ముగ్గుల పోటీలు, స్లో సైకిల్ పోటీలు, హన్నింగ్ ఛాలెంజ్ గేమ్, డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు.

'మహాశక్తి'పై ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ 83వ వార్డు, మిరియాల కాలనీలో టిడిపి ఆధ్వర్యాన సోమవారం మహాశక్తి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. 83వ వార్డు ఇన్‌ఛార్జి బొడ్డపు ప్రసాద్, అర్బన్ జిల్లా కార్యదర్శి శంకర్ల పద్మలత ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి నాయకులు నాథమని ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

డైట్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. వారం రోజులు పాటు ఈసీఈ విద్యార్థులకు జరుగుతున్న ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్ సర్టిఫికెట్స్ సంపాదించుకుంటారని ఈ.సి.ఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్స్ విద్యార్థుల ఉద్యోగ భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జె.లోవబాబు, డీన్ అకడమిక్స్ డాక్టర్ కె. పార్వతి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో ఉప ఎన్నికల వేడి

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో బుచ్చయ్యపేటలో ఎన్నికల వేడి ప్రారంభమైంది. 2021 ఫిబ్రవరిలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బుచ్చయ్యపేట గ్రామ సర్పంచ్‌గా టిడిపి మద్దతుదారుడు సుంకర సూరిబాబు ఎన్నికయ్యారు. గత ఏడాది నవంబర్ 17న ప్రమాదవశాత్తు సూరిబాబు మృతి చెందాడు. దీంతో ఉప సర్పంచ్‌కు సర్పంచిగా పంచాయతీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఇప్పుడు ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామంలో ఉప ఎన్నికల వేడి మొదలైంది. మంగళవారం నుండి నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఖాళీ అయిన సర్పంచ్ స్థానానికి ఎవరికి అవకాశం ఇవ్వాలి, ఎవరిని బరిలో దింపాలోనని గ్రామస్తుల్లో చర్చలు ప్రారంభమయ్యాయి.

బుచ్చయ్యపేట ఎంపిటిసి-1గా ఎన్నికైన వైసిపికి చెందిన కొల్లి మహాలక్ష్మి నాయుడు ఎన్నికైన 6 నెలల లోపే 2021 నవంబరు 2న అనారోగ్యంతో మృతి చెందాడు. తరువాత సర్పంచ్ సూరిబాబు కూడా మృతి చెందడంతో బుచ్చయ్యపేటలో రాజకీయ నైరాస్యం ఏర్పడింది. గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందారు. సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో, అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపికి చెందిన నాయకులు చర్చలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎంపిటిసి ఉప ఎన్నికకు త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో గ్రామస్తులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని అభ్యర్థులను ఎంపిక చేసుకుని అవకాశం ఉందని అంటున్నారు.

ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఇఆర్ఓ రామలక్ష్మి



మాట్లాడుతున్న ఈఆర్వో రామలక్ష్మి

ప్రజాశక్తి-కోటవురట్ల: ఎన్నికల సిబ్బంది రాజకీయ నాయకులతో వివాదాలకు, స్నేహాలకు దూరంగా ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని పాయకరావుపేట నియోజకవర్గ ఈఆర్వో రామలక్ష్మి తెలిపారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె బిఎల్ఓల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో శతాధిక వృద్ధులు అధికంగా ఉన్నట్లు గుర్తించామని, వాటి పట్ల సమగ్ర సర్వే చేపట్టి ధ్రువీకరించాలని సిబ్బందికి సూచించారు. ఫారం 6, 7 ,8 నింపే విధానంపై అడ్డగా సిబ్బంది నుంచి సమాధానం సక్రమంగా రాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారందరికీ ఓటు హక్కు నమోదు, తొలగింపుపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలగింపులు, చేర్పులు, సవరణలో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా చూడాలని, వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. మండల వ్యాప్తంగా పోలింగ్ బూత్ ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 27వ నెంబర్ పోలింగ్ బూత్ పరిధిలో పలు గ్రామాలు ఎక్కువ దూరంగా ఉండటం పట్ల పరిశీలించాలని తహసిల్దార్ జానకమ్మకు సూచించారు. పోలింగ్ బూత్ పరిధిలో రెవెన్యూ మ్యాప్‌ను సిబ్బందికి అందజేయక పోవడం పట్ల మండల సర్వేయర్ ను మందలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖరు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

తల్లిపాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని ఉపమాకలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మంచి పోషకాలు అందుతాయని పలువురు నేతలు తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణీలకు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, వైసిపి నాయకులు మనబాల తాతారావు, కొప్పిశెట్టి హరిబాబు, కొల్లాటి బుజ్జి, తెలుగుదేశం పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదతీనార్ల గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ శ్రీనివాసరావు ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడి

టీకాలతో పశువులకు రక్షణ

ప్రజాశక్తి-మాడుగుల: పశువులకు లంపి స్కిన్ వ్యాధి, ముద్ద చర్మ వ్యాధి రాకుండా టీకాలు వేయాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆదేశించారు. సోమవారం కేజే పురం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 31 వరకు టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు ఎన్ని టీకాలు వేశారని పశు వైద్య సహాయకుడు రమేష్‌ను ప్రశ్నించారు. పాడి రైతులకు పశు మత్స్య దర్శిని మ్యాగజైన్, మిశ్రమ దాణాపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఓట్ల తొలగింపుపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో కొవ్వూరు గ్రామంలో పోలింగ్ బూత్ నెంబరు 20లో టిడిపి సానుభూతిపరుల పేర్లను 30 మందిని తొలగించారని ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన బంటు రాజు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రమీలాగాంధీ గ్రామంలో పర్యటించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆ గ్రామంలో 13 మంది మరణించారని సర్వేలో తేలిందన్నారు. అయితే మరణించిన వారి పేర్లకు బదులు బతికున్న వారి పేర్ల తీసివేయడం జరిగిందన్నారు. బతికి ఉన్న వారు ఫారం 6 సమర్పిస్తే వారికి తిరిగి ఓటు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.వరహాలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రోయిన్ మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలో పెనుగొల్లు వరహానది గ్రోయిన్ వెంటనే మరమ్మతు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు సోమవారం అసిస్టెంట్ ఇంజనీర్ నీటిపారుదల శాఖ ఏఈ చిన్నారావుకి వినతపత్రం అందజేశారు. పెనుగొల్లు వరహానదిలో గ్రోయిన్ గత సంవత్సరం వరదల కారణంగా దెబ్బతిందన్నారు. వరహానదిలో నీరు వామవారం పెద్దఉప్పలం పాయగా బంగాళాఖాతంలో కలిసి పోవడంతో రాయవరం, లింగరాజుపాలెం, కర్రీవానిపాలెం, పిట్లపాలెం, ఉప్పరపల్లి, సర్వసిద్ధి, వాకపాడు, వెంకటాపురం గ్రామాల రైతులు వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి పారుదల శాఖ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-యస్.రాయవరం: ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. సోమవారం అడ్డరోడ్డు జంక్షన్ పై ఓవర్ వద్ద ఆటో డ్రైవర్ ఓనర్లకు, యూనియన్ సభ్యులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తుని, యలమంచిలి, నర్సీపట్నం, రేవుపోలవరం, పెదతీనార్ల ఆటోస్టాండ్ యూనియన్ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించడం, డ్రైవర్ పక్కన ప్రయాణీకులను ఎక్కించడం, మద్యం సేవించి వాహనం నడిపితే కేసుల నమోదుతో పాటు ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



నక్కపల్లిలో కిట్లు ఇస్తున్న ఎంపిపి, డైరెక్టర్

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి కొత్తపేట అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే.లలిత ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎంపీపీ రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ జయ రత్నకుమారిలు గర్భిణీలకు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గర్భిణీ, బాలింతలలో రక్తహీనత లోపించకుండా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, అల్లాడ కొండ, నాగమణి, అంగన్వాడి కార్యకర్తలు జయలక్ష్మి, దుర్గారాణి, అపర్ణ, లక్ష్మీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండలకేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషకారం పంపిణీ టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని స్థానిక నాయకులు చేపట్టారు. సోమవారం గ్రామ సచివాలయం ఆవరణలో గర్భిణులు, బాలింతలకు జెడ్పీటిసి కాకర దేవి, ఎంపిపి కోన లోవలక్ష్మిలు కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు మెరుగైన పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ఇంటివద్దకే రేషన్ పథకం చేపట్టింద ఎంపిటిసి బొలిశెట్టి గోవిందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ ఆదిమూర్తి, వైయస్సార్ నాయకులు కొణతాల శ్రీను, కాశీ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మల్లునాయుడుపాలెంలో వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లును ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్పి వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు సోమవారం గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోను దేముడమ్మ గంగు నాయుడు, ఎంపీటీసీ గొర్లె కనకరాజు, జిల్లా వీఆర్వోల సంఘ అధ్యక్షులు ఎస్. టి. రామకాసు, ఉప సర్పంచ్ ఆర్. వెంకట రమణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని కొండపాలెంలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుమ్మడి రాజునాయుడు పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పోషకాహార కిట్లును ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, వైసిపి నాయకులు గెద్దం ఉమ, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, ఎంపీడీఓ హేమ సుందరరావు, తహసీల్దార్ పి కనకరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి



మాట్లాడుతున్న గిరిజనులు

కలెక్టర్‌కు గిరిజనుల వినతి

ప్రజాశక్తి -కోటవురట్ల: గొట్టువాడ శివారు అణుకు గిరిజన గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని సోమవారం జిల్లా కలెక్టర్ను గిరిజనులు మరో మారు కలిసి విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు రహదారి మంజూరుకు తీసుకోవలసిన ప్రక్రియను వేగవంతంగా చేయాలని సూచించినట్లు గిరిజనులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు డేవిడ్‌రాజు, గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

సమస్యలపై ఫెర్రో ఎల్లాయిస్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - అనకాపల్లి : ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై విద్యుత్ ఛార్జీలు, కస్టమర్, ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో మోపిన భారాలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 23 నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో పరిశ్రమలు విలవిల్లాడుతున్నాయన్నారు. వీటిపై ఐదు వేల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయని తెలిపారు. ముడి సరుకు ధర పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఉత్పత్తుల ధరలు తగ్గడంతో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు సంక్షోభం దిశగా నడుస్తున్నాయని అన్నారు. దీంతో కార్మికులు తమ జీవనోపాధిపై భయాందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎపి స్టేట్ ఫెర్రో ఎల్లాయిస్ వర్కర్స్ కో - ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఆర్.రాము, అచ్యుతాపురం ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.సోమినాయుడు, అభిజిత్, సుందరం, మైతాన్ పరిశ్రమల కార్మికులు గోపి, రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో రెండు పంచాయతీ గ్రామాల్లో రెండు వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి షెడ్యూల్ విడుదల అయినట్లు ఎంపిడిఓ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మండలంలోని చిన్నదొడ్డిగల్లులో 1వ వార్డ్ మెంబర్ గా ఎన్నికైన వెలగా ఈశ్వరరావు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు. రేబాక పంచాయతీ 3వ వార్డ్ మెంబర్ మృతి చెందడంతో ఖాళీ ఏర్పడిందని, ఈ రెండు పంచాయతీల్లో రెండు వార్డు మెంబర్లకు సంబంధించి ఎన్నిక నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ షెడ్యూలు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 8 వ తేదీ నుండి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 12న తిరస్కరించిన నామినేషన్ లపై ఆర్డీవోకు అప్పీల్, 13న అప్పీల్ పరిష్కారం, 14న నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, 19న పోలింగ్, అదే రోజు పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు, గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సీతారామరాజు ఉన్నారు.

గొలుగొండ:మండలంలో వార్డు మెంబర్ల ఖాళీలు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. మండలంలోని గాదంపాలెం గ్రామ పంచాయతీ రెండో వార్డు, నాగాపురం గ్రామ పంచాయతీ ఏడవ వార్డు ఎన్నికల నిర్వహణకు ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ భూ దందాపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్: పెందుర్తి తహశీల్దారుగా గతంలో పనిచేసిన ఆనంద్ కుమార్ ఎమ్మెల్యే అదీప్‌రాజుకు తొత్తుగా, పిఎగా వ్యవహరించి రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి సహకరించడంతో ఆ ఎమ్మెల్యే పలు భూదందాలకు పాల్పడ్డారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ పెందుర్తి తహశీల్దారుగా పనిచేసిన ఆనంద్ కుమార్ అనేక రికార్డులను తారుమారు చేశారన్నారు. ముదపాక భూములపై తహశీల్దార్ అక్రమాలపై హైకోర్టుకు వెళ్లామన్నారు. హైకోర్టు డైరెక్షన్ ప్రకారం ఆనంద్ కుమార్‌ని సస్పెండ్ చేయాల్సి ఉన్నప్పటికీ ట్రాన్స్‌ఫర్ చేశారన్నారు. సర్వే నెంబర్ 230/3లో ఆనందకుమార్ 1బిలో పేర్లు మార్చేశారన్నారు. చనిపోయిన వారి పేర్లతో ల్యాండ్ పూలింగ్ చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రోత్సాహంతో జుత్తాడ రెవిన్యూలో వైసిపికి చెందినవారు నాలుగు ఎకరాల్లో ఇళ్లు కడుతున్నారన్నారు. పెదగాడి గ్రామంలో ఎల్‌పిసిలు రద్దు చేశారన్నారు.

'జగనన్న'కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 218 వినతులు వచ్చాయి. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 84 అర్జీలు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. ఆమెతో పాటు కమిషనర్ సాయికాంత్ వర్మ జివిఎంసిలో ఫిర్యాదులు స్వీకరించారు. వినతులను మూడు రోజుల్లో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన స్పందనకు 54 ఫిర్యాదులు అందాయి. నగర డిసిపి (క్రైమ్) జి.నాగన్న, ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్‌కె.రాజు, ఎడిసిపి (ఎస్‌బి) ఇ.నాగేంద్రుడు లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణ పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

280 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి గుట్టుగా గంజాయి తరలిస్తున్న ముఠాని పట్టుకోవడం జరిగిందని స్థానిక ఎస్సై రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు ప్రాంతం నుండి విశాఖ మైదాన ప్రాంతమునకు గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మెయిన్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశామన్నారు. బొలెరోతో పాటు బైక్‌తో గంజాయి తరలిస్తూ ఐదుగురు నిందితులు పట్టు పడ్డారని తెలిపారు. సుమారు 280 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసా ఘటనలపై నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ:మణిపూర్‌లో హింసను నిరసిస్తూ సిపిఐ, డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో కృష్ణదేవిపేట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఘటనలను పక్కదోవ పట్టించడానికి చూస్తున్నాయన్నారు. ఇప్పటికైనా మహిళలు, ప్రజలంతా ఏకమై బిజెపిని గద్దె దింపేంత వరకు పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి పి.లోవరాజు, సిపిఐ కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు జి.రాధాకృష్ణ, సీపీఐ, డిహెచ్‌పిఎస్ కార్యదర్శులు మేకా భాస్కరరావు, పి.కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాడుగుల:మణిపూర్‌లో జరుగుతున్న దాడులు ఖండించాలని సోమవారం మాడుగులలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాలను లక్ష్యంగా పెట్టుకుని దాడులు చేయడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ల సంఘం అధ్యక్షులు అబ్రహం, వర్కింగ్ కార్యదర్శి గుడాల ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు అకుల, కార్యదర్శి సురేంద్ర కుమార్, కోశాధికారి శామ్యూల్ పాల్గొన్నారు.



మాడుగులలో చేపడుతున్న ర్యాలీ


గొలుగొండలో ర్యాలీ చేపడుతున్న నాయకులు

మధురవాడ:మణిపూర్ బాధితులకు సంఘీభావంగా సిపిఐ ఆధ్వర్యాన సోమవారం కొమ్మాది జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. దుండగులకు సహాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చెయ్యాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఐ మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు ఎమ్.డి.బేగం మాట్లాడుతూ, మణిపూర్‌లో ప్రజల మధ్య గొడవలకు కారణం బిజెపి అని ఆరోపించారు. ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు అజమాయిషీలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు తిరుపతిరావు, బాబూరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీల్లో రుత్విక్ సత్తా

ప్రజాశక్తి-నక్కపల్లి:ఈ నెల 4,5,6 తేదీల్లో బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని ఉప మాక గ్రామానికి చెందిన దవరసింగి ఆదిత్య రుత్విక్ మూడో స్థానం సాధించాడు.12 నుంచి 15 ఏళ్ల బాలుర విభాగంలో రుత్విక్ ఈ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్టు రుత్విక్ తండ్రి, యోగా టీచర్ దవరసింగి రాంబాబు స్థానిక విలేకరులకు సోమవారం తెలిపారు. నర్సీపట్నం ఎంజేపీ ఏపీ బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్లో రుత్విక్ 8వ తరగతి చదువుతున్నాడు. గురుకులం ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి, ఉపాధ్యాయుల సూచనలతో యోగ సాధన చేస్తున్నానని, రానున్న రోజుల్లో జాతీయ స్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించేందుకు మరింత కృషి చేస్తానని ఆదిత్య రుత్విక్ తెలిపాడు.



9న ఆదివాసీ దినోత్సవ సభలు

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని వి.ఆర్. కళ్యాణ మండపంలో ఐ.టి.డి.ఎ. ఆధ్వర్యములో ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మోదకొండమ్మ అమ్మవారికి పట్టు వస్త్రముల సమర్పణ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథుల సందేశం, గిరిజన పెద్దలకు సన్మానం, గిరిజన లబ్దిదారులకు యాంత్రీకరణ పరికరములు పంపిణీ తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అనంతగిరి:
ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని ఆదివాసి ప్రజాసంఘాలు సన్నద్ధం అవుతున్నాయి. ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆదివాసుల దినోత్సవం నిర్వహించేందుకు కలిసి రావాలని ఆదివాసి గిరిజన సంఘం ప్రతినిధులు ఎస్.నాగులు, ఎస్. కొండలరావు, జె.సుబ్బారావు, ఆదివాసి ఉద్యోగ సంఘాల నాయకులు పి. దేవుడు, ఎస్.రాంబాబు, గురుదొర, సన్యాసిరావు పిలుపునిచ్చారు.

10న నులిపురుగుల మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు:మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల స్థాయి అధికారులతో ఎంపీడీఓ పూర్ణయ్య సమావేశం నిర్వహించారు. ఈనెల 10న డీ వార్మింగ్ మందులను మెడికల్ సిబ్బంది విద్యార్థులకు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ సమావేశం లో పెదబయలు, గోమాంగి, రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులు, మండల విద్యా శాఖధికారులు కొమ్ము కృష్ణమూర్తి పాల్గొన్నారు.